క్లుప్తంగా

మాజీమంత్రి హరీశ్‌ను కలిసిన బీఆర్‌ఎస్ శ్రేణులు



మాజీమంత్రిని కలిసిన బీఆర్‌ఎస్ శ్రేణులు

పటాన్‌చెరుటౌన్: సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును బీఆర్‌ఎస్ నాయకులు కలిశారు. హోలీ పండుగ నేపథ్యంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ సోమిరెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్‌రెడ్డి శుక్రవారం నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

హోలీ ఐక్యతను పెంచుతుంది

ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి



వాకర్ అసోసియేషన్ సభ్యులతో ఎమ్మెల్యే సోదరుడు మధు, శంకర్ యాదవ్

పటాన్‌చెరుటౌన్: హోలీ మనుషుల మధ్య ఐక్యతను ఆనందాన్ని పెంచుతుందని ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు డివిజన్ పరిధితోపాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. పటాన్‌చెరు శివారులోని వాగర్స్ అసోసియేషన్ సభ్యులతో ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్‌లు హోలీ సంబరాలు జరుపుకున్నారు. అదేవిధంగా కాలనీలలో,ప్రధాన రహదారులో చిన్నా పెద్దా తేడా లేకుండా కాలనీలో రోడ్లపై హోలీ పండుగ సంబరాలు జరుపుకున్నారు.

రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన చెట్టు



రోడ్డుపై అడ్డంగా పడిన మర్రి చెట్టు

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండల పరిధిలోని రాంసాన్‌పల్లి గ్రామ సమీపంలో నాందేడ్- అకోలా జాతీయ రహదారి పక్కనే ఉన్న మర్రి చెట్టు విరిగిపడి రోడ్డుపై అడ్డంగా పడింది. శుక్రవారం ఉదయం రోడ్డుపై పడిన చెట్టును సాయంత్రం వరకు అధికారులు తొలిగించకపోవడంతో వాహనదారులు రోడ్డు కింది నుంచి వెళ్లడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు రహదారి పక్కనే ఉన్న ఎండు గడ్డికి నిప్పు పెట్టడంతో అది చెట్టుకు అంటుకుని సగానికి పైగా చెట్టు తగలబడి విరిగినట్లు తెలిస్తోంది. అధికారులు వెంటనే రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

చలి వేంద్రం ప్రారంభం

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లో చలి వేంద్రాన్ని ప్రారంభించారు. వేసవిలో దాహం తీర్చేందుకు ఏబీ మేనేజర్ ఫౌండేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని బీఎస్పీ పార్టీ ఇన్‌చార్జి మోహన్, రాయికోడ్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజుగౌడ్, నవీన్, ఎల్గోయి లక్ష్మన్, జైపాల్ మొగులప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎస్పీ పార్టీ జిల్లా ఇన్‌చార్జి మోహన్ మాట్లాడుతూ వేసవిలో మండల ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చిన ఏబీ మేనేజర్ ఫౌండేషన్ సభ్యులను అభినందిస్తున్నట్లు తెలిపారు. మండలంలో చలి వేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప విషయమని సీనియర్ నేత రాజుగౌడ్ అన్నారు. ప్రజలు చలి వేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాం నారాయణ్, ఏబీ మేనేజర్ ఫౌండేషన్ ఫౌండర్ సుదర్శన్, సభ్యులు నర్సింలు, బాలు, రమేశ్, శ్యామ్, పలువురు స్థానికులు పాల్గొన్నారు.

హోటల్‌కు నిప్పంటించిన దుండగులు

నారాయణఖేడ్: ఖేడ్ మండలం రుద్రారం చౌరస్తా వద్ద తెనుగు నర్సింహులుకు సంబంధించిన హోటల్‌కు శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. అటుగా వాహనాలపై రాకపోకలు సాగిస్తున్న వారు గమనించి మంటలు అదుపుచేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. హోటల్ మొత్తం కాలి బూడిదైపోయింది. కాగా ఈ అగ్ని ప్రమాదంలో రూ.50 వేల వరకు నష్టం జరిగిందని, తనను ప్రభుత్వమే ఆదుకోవాలని కోవాలని నర్సింహులు కోరుతున్నాడు.

హోలీ.. రంగుల కేళీ



సదాశివపేటలో ఎస్పీ పరితోష్ పర్యవేక్షణ



నారాయణఖేడ్: భక్తమార్కండేయ ఆలయం వద్ద ఉట్టి కొడుతూ..



జహీరాబాద్ పట్టణం జర్నలిస్టు కాలనీలో..



వట్‌పల్లి: కన్‌సాన్‌పల్లిలో..



సంగారెడ్డి పాత బస్టాండ్ రామ్ మందిర్ దగ్గర హోలీ వేడుకలో పాల్గొన్న జగ్గారెడ్డి

జిల్లా వ్యాప్తంగా హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. చిన్నా, పెద్దతేడా లేకుండా అంతా శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. ఒకరికొకరు రంగులు చల్లుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. యువత రోడ్లపైకి వచ్చి కేరింతలు కొట్టారు. గురువారం రాత్రి కాముని దహనం కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు, యువకులు నృత్యాలు చేసి సందడి చేశారు. వివిధ పార్టీల నాయకులు హోలీ వేడుకల్లో పాల్గొని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.



సంగారెడ్డి విద్యానగర్ కాలనీలో మహిళలు, చిన్నారులు..



బుస్సారెడ్డిపల్లిలో రంగులు చల్లుకున్న ప్రజలు



కందిలో హోలి సంబరాలు..



కార్యకర్తలతో కలసి ఎమ్మెల్సీ అంజిరెడ్డి వేడుకలు



రామచంద్రాపురం: ఆర్‌ఆర్‌నగర్‌లో..



హోలీ సంబరాల్లో చిన్నారులు



జహీరాబాద్: పస్తాపూర్‌లో హోలీ సంబరాలు..



జిన్నారం మండల కేంద్రంలో హోలీ ఆడుతున్న నాయకులు, యువకులు



కల్హేర్: బల్కంచెల్క తండాలో హోలీ వేడుకలు

నూర్పిళ్ల జోరు.. ధర లేక దిగాలు

- ఆందోళనలో శనగ రైతులు
- జిల్లాలో సుమారు 20 వేల ఎకరాల్లో పంట సాగు



నూర్పిళ్ల కోసం కోసిన శనగ పంట

జహీరాబాద్ టౌన్: రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన శనగ పంట నూర్పిళ్లు జోరుగా సాగుతున్నాయి. కూలీల కొరత తదితర కారణాలతో కోత ఆలస్యమైంది. పత్తి తర్వాత రెండవ పంట వేయడం వల్ల కూడా నూర్పిళ్లు ఆలస్యమతుంది. పప్పు దినుసుల్లో కంది తర్వాత శనగ అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. జిల్లాలో సుమారు 20 వేల ఎకరాల్లో పంట సాగు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం నూర్పిళ్ల పనులు జోరుగా సాగుతున్నాయి. కూలీల కొరత వల్ల ఇబ్బందులు ఎదురవడంతో కోత మిషన్ల సాయంతో పంట కోత చేపడుతున్నారు. పలు కారణాలతో పంట దిగుబడి తగ్గిందని, ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్లు వస్తుందని రైతులు పేర్కొన్నారు. అయితే ధర చూసి రైతులు నిరాశకు గురవుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.4,500 నుంచి రూ.5 వేలు పలుకుతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గిట్టుబాటు ధర లేక చేసిన అప్పులకే సరిపోతుందన్నారు.

గిట్టుబాటు ధర లేదు



వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పంట సాగు చేస్తే గిట్టుబాటు ధర లభించడంలేదు. ప్రస్తుతం పంటలకు గిట్టుబాటు ధర లేదు. శనగ పంట కూడా రూ.4,500లకే విక్రహించాల్సి వస్తుంది. పంట నిల్వ చేసుకోలేక తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుంది.

–డి.శివకుమార్,రైతు, ఎల్గోయి

పన్నుల వసూలు ప్రత్యేక కార్యాచరణ

- ఈ నెల 31 వరకు వంద శాతం లక్ష్యం
- నిర్లక్ష్యం చేసే వారికి షోకాజ్ నోటీసులు



చెర్ల గూడెంలో ఆస్తి పన్ను వసూలును పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కంది(సంగారెడ్డి): మండలంలో ఆస్తి పన్నుల వసూలును అధికారులు వేగవంతం చేశారు. గ్రామాల అభివృద్ధికి ఆదాయ వనరులుగా ఉన్న పన్నుల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. 2024, 2025 ఆర్థిక సంవత్సరం ముగింపునకు చేరుతుండటంతో ఈ ఏడాది పన్నుల వసూలు ఈ నెల 31వ తేదీ వరకు వంద శాతం చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ మహేందర్ రెడ్డి నిరంతరం పన్నుల వసూలుపై దృష్టి సారించారు. పంచాయతీ కార్యదర్శు లు, సిబ్బందికి సూచనలు ఇస్తున్నారు. పన్నుల వసూళ్లలో వెనుకబడి ఉన్న వారికి షోకాజ్ నోటీసులు ఇస్తున్నారు. మండలంలో 22 గ్రామపంచాయతీలు ఉండగా ఈ ఏడాది 3.92 కోట్ల రూపాయలు వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 3.30 కోట్ల ఆస్తి పన్ను వసూలైనట్లు ఎంపీఓ మహేందర్ రెడ్డి తెలిపారు. మిగతావి ఈ నెల 20వ తేదీ వరకు వందశాతం వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు.

సంక్షిప్త వార్తలు

◆ **నేడు పోస్టాఫీసు ప్రారంభోత్సవం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌కు మంజూరైన పోస్టాఫీసు కార్యాలయాన్ని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు శనివారం ప్రారంభించనున్నారు. ఎన్నికల సమయంలో స్థానికుల కోరిక మేరకు మున్సిపల్ పరిధిలోని అంబేడ్కర్ కాలనీలో పోస్టాఫీసును మంజూరు చేయించారు. అయితే దానిని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేస్తే అందరికీ అనువుగా ఉంటుందని కొందరు స్థానికులు కోరుతున్నారు.

◆ **నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత...**

పటాన్‌చెరు: సబ్ స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు సబ్ స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పటాన్‌చెరు ఏఈ జగదీశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరమ్మతుల నేపథ్యంలో ఐడీఏ- 2 పారిశ్రామిక ప్రాంతం, వాల్యూ జోన్, ఇండస్ట్రియల్ రోడ్, విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలన్నారు.

◆ **కిష్టారెడ్డిపేట్ సబ్‌స్టేషన్ పరిధిలో..**

పటాన్‌చెరు టౌన్: కిష్టారెడ్డి పేట్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం సమ్మర్ యాక్షన్ ప్లాన్ నేపథ్యంలో ఉదయం 1:30 నుంచి 2:30 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని శుక్రవారం ఏఈ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేట్ పరిధిలోని సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో పటేల్ గూడలోని వీఆర్‌సీ, హోమ్స్, భ్రమరాంబిక మల్లికార్జున నగర్, సృజన లక్ష్మీనగర్, సూర్యోదయ కాలనీలో అదేవిధంగా పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీ, ఏపీఆర్, ఓడీఎఫ్ కాలనీల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు.

◆ **22న హరి కీర్తన, భజన...**

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీలో ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 22న హిందూ సమాజ సేవ నవయువక్ సంఘ్ వారి ఆధ్వర్యంలో 24 గంటల హరి కీర్తన భజన నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కార్పొరేటర్‌ను నిర్వాహకులు కలిసి పూజలో పాల్గొనాలని ఆహ్వానించారు.

◆ **ప్రతిపక్షాల గొంతు నొక్కడమే లక్ష్యమా?**

గజ్వేల్: ప్రతిపక్షాల గొంతు నొక్కడమే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. అసెంబ్లీ నుంచి మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం గజ్వేల్‌లో ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు.

ఉపాధ్యాయ కుటుంబాలకు అండగా ఉంటాం

వీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి

దుబ్బాక: కష్టాల్లో ఉన్న ఉపాధ్యాయుల కుటుంబా లను పీఆర్టీయూ సంక్షేమ నిధి ద్వారా ఆదుకుంటా మని వీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన దుంపలపల్లిలోని జెడ్పీ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు అశోక్ కుటుంబానికి శుక్రవారం రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు మరణిస్తే వెంటనే సంక్షేమనిధి నుంచి లక్ష రూపాయలు అందజేస్తామన్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి శశిధర్‌శర్మ, నాయకులు పల్లె శ్రీనివాస్‌గౌడ్, మద్దుల లక్ష్మారెడ్డి,రాంచంద్రారెడ్డి, ఎంఈఓ ప్రభుదాసు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నేతల ఫిర్యాదు

దుబ్బాక: తెలంగాణ తొలి సీఎం, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్‌పై కనీస గౌరవం లేకుండా రేవంత్‌రెడ్డి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, మల్లేశం గౌడ్, కృష్ణ తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా ‘పై’ డే

వర్గల్(గజ్వేల్): దశాబ్ది ఉత్సవాలలో భాగంగా వర్గల్ పూలే మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా ‘పై’ డే నిర్వహించారు. ‘పై’ గుర్తు ప్రత్యేకత, గణితంలో దాని ప్రాముఖ్యం గురించి ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు విద్యార్థులకు వివరించారు. గణితంలో అంకెలు, గుర్తులకు ఎంతో ప్రాధాన్యం ఉంటుందన్నారు. గణితాంశంతో కూడిన ‘ట్రెజర్ హంట్’ గేమ్ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ గోవిందరావు, ఏటీపీ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

మహాత్ములు చూపిన మార్గంలో నడవాలి

బసవదళ్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్



మాతే మహాదేవి చిత్రపటానికి పూజలు చేస్తున్న బసవదళ్ నాయకులు

జహీరాబాద్ టౌన్: మహాత్ములు చూపిన మార్గంలో నడుచుకోవాలని బసవదళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్ పేర్కొన్నారు. ప్రథమ మహిళా జగద్గురు స్వర్గీయ మాతే మహాదేవి 79వ జయంతి వేడుకలను శుక్రవారం పట్టణంలోని బసవ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకర్ పాటిల్ మాట్లాడుతూ...జగద్గురు మాతే మహాదేవి మాతాజీ జనన మరణం ఒకే రోజు కావడం విశేషమన్నారు. లింగాయత్‌ల అభ్యున్నతికి ఆమె ఎంతోగానో కృషి చేశారని, ఆమె అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో జహీరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ శరణప్ప, అక్కనబళగ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీశైలానికి చేరుకున్న మహాపాదయాత్ర



శ్రీశైలానికి చేరుకున్న శివాచార్యులు ఆయన భక్తులు

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని ధనసిరి పీఠాధిపతి శ్రీ వీరేశ్వర శివాచార్యుల ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం చేపట్టిన మహా పాద యాత్ర శుక్రవారం శ్రీశైలక్షేత్రంకు విజయవంతంగా చేరుకుంది. ప్రతీ సంవత్సరం శివాచార్యులు తన భక్తులతో కలసి మహాశివరాత్రి తర్వాత మహా పాద యాత్ర చేపడతారు. ఈ ఏడాది సుమారు 800మంది భక్తులతో కలసి పదిరోజుల క్రితం మహా పాద యాత్ర ప్రారంభించారు. 380 కిలో మీటర్ల వరకు కొనసాగిన మహాపాదయాత్ర విజయవంతంగా ముగిసింది. పాదయాత్రలో పాల్గొన్న భక్తులు స్వామి వారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమవుతారని చెప్పారు. పాదయాత్రలో మామిడ్గి మల్‌శెట్టి, ధనసరి మాజీ సర్పంచ్ హబ్సిరాజు,సంగారెడ్డి తదితరులు ఉన్నారు.

వర్గీకరణ జరిగేంత వరకు పోరాటం ఆగదు

మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా నేత



దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జహీరాబాద్: ఎస్సీ వర్గీకరణ పూర్తిచేసేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ అన్నారు. మూడో రోజుకు చేరుకున్న ఎమ్మార్పీఎస్ దీక్ష శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టం చేసేంతవరకు ఉద్యోగ పరీక్ష ఫలితాలను విడుదల చేయొద్దని డిమాండ్ చేశారు. మాదిగల పోరాటం నిరుద్యోగులకు వ్యతిరేకం కాదని, ఉద్యోగాల భర్తీలో అన్ని కులాలకు న్యాయం జరగాలన్నదే తమ ఉద్దేశ్యమని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఉల్లాస్ మాదిగ, నిర్మల్, ప్రభాకర్ శ్రీనివాస్, జైరాజ్, రాంచందర్, సుకుమార్, కిట్టు, ప్రశాంత్, ధన్‌రాజ్, రాకేశ్, అఖిల్, సందీప్, సతీశ్, సమృద్ధి, పవన్, అజయ్, ఏసురత్నం పాల్గొన్నారు.

జహీరాబాద్ చేరుకున్న పల్లకీ సేవ



మాట్లాడుతున్న సిద్ధేశ్వరానందగిరి మహారాజ్

జహీరాబాద్: ఈనెల 10వ తేదీన బెల్లాపూర్ నుంచి ప్రారంభమైన దత్తాత్రేయ స్వామి వారి పల్లకీ సేవ పాదయాత్ర శుక్రవారం రాత్రి జహీరాబాద్‌లోని కైలాసగిరి ఆలయానికి చేరుకుంది. దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం, భక్తులు వారికి స్వాగతం పలికారు. ఉదయం గంగ్వార్, మిర్జాపూర్(బి), కొత్తూర్(బి) గ్రామాల మీదుగా యాత్ర కొనసాగింది. ఆయా గ్రామాల్లో భక్తులు పల్లకీ సేవ పాదయాత్రకు ఘనంగా స్వాగతం పలికి పూజలు చేసి దర్శించుకున్నారు. ఈసందర్భంగా బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ మాట్లాడుతూ.. నేటి ఉరుకులు పరుగుల జీవితంలో మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి ఆలయాలు ప్రశాంత నిలయాలుగా ఉన్నాయన్నారు. వీటిని పరిరక్షించుకునేందుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆయా ఆలయాల పీఠాధిపతులు, భక్తులు పాల్గొన్నారు.